క్లుప్తంగా

1 నుంచి సచివాలయాల్లో జగనన్న సురక్ష

పెనమలూరు: జగనన్న సురక్ష కార్యక్రమం జూలై 1వ తేదీ నుంచి మండల పరిధిలోని సచివాలయాల్లో నిర్వహించనున్నారు. ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు బుధవారం వివరాలు వెల్లడించారు. మండలంలో సచివాలయాల వద్ద 1వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామన్నారు. క్యాంపుల తేదీలు తెలుపుతూ 1వ తేదీన చోడవరం సచివాలయం, 3వ తేదీన పెదపులిపాక, 4వ తేదీ గంగూరు-1, 5వ తేదీ గోసాల-1, 6వ తేదీ గంగూరు 2, 7వ తేదీ గోసాల 2, 10వ తేదీ పెనమలూరు 1, 11వ తేదీ వణుకూరు 1, 12వ తేదీ పెనమలూరు 2, 13వ తేదీ వణుకూరు 2, 14వ తేదీ పెనమలూరు 3 సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు ఉంటాయన్నారు. మండలంలో రెండు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశామని, గ్రామస్తులు వారికి ఉన్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

ఉయ్యూరు: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఇరువురు పేద కుటుంబాలకు వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం ఆర్థిక చేయూత అందించారు. ఐదో వార్డుకు చెందిన జీడీ కృష్ణ, ఉయ్యూరు నాంచారమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుల కుటుంబాలను పార్టీ ఐదో వార్డు ఇన్‌చార్జి దిరిశం జ్యోతిర్మయి, నాయకులు మట్టా జగన్, కలకట్ల డాలీ, నందేటి ప్రవీణ్, కొక్కిలిగడ్డ ప్రదీప్, హనోక్ పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించి అండగా నిలుస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో నరేంద్ర, కవిత, ఆదాం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

నెనవరం(విజయవాడరూరల్) పి.నైనవరం గ్రామం గాంధీ బొమ్మ సెంటర్‌కు సుందరయ్య, ఆ పైన కొండ ప్రాంతాల నుంచి వచ్చే వర్షం నీటి రోడ్డు పై పొర్లుతుండటంతో డ్రైనేజీ కాల్వ పనులు చేయిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ బట్టా చిన్నబ్బాయి తెలిపారు. డీఎస్‌ఆర్ రోడ్డులో పూడుకుపోయిన డ్రైనేజీ కాల్వలో పొక్లెయిన్‌తో కాల్వను లోతు తీస్తూ, వ్యర్థాలు తొలగిస్తున్నామన్నారు. వర్షాలకు వచ్చే కొండనీరు కాల్వ నుంచి అవుట్‌పాల్ డ్రెయిన్‌లోకి పారుదల అవుతుందన్నారు. గ్రామ కార్యదర్శి చెన్నకేశవరావు, సచివాలయ సిబ్బంది పనులు చేయించారు.

ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే వంశీమోహన్

హనుమాన్‌జంక్షన్ రూరల్:ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుకాకూడదనే సంకల్పంతో ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చేయూతను అందించటం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. బాపులపాడు మండలం వీరవల్లిలో పేద విద్యార్థి తొమ్మండ్రు మానస ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే వంశీమోహన్ దృష్టికి తీసుకువెళ్లటంతో ఆయన సొంత నిధులు రూ.25 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. అలాగే ఇటీవల భర్త మరణించటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న బెజవాడ కృపారాణికి రూ.10 వేలు సాయం అందించారు. ఈ మొత్తాన్ని మానస తల్లిదండ్రులు, కృపారాణిలకు వైఎస్సార్ సీపీ నాయకులు గూడవల్లి సుధాకర్, కొడెబోయిన బాబి, ఆత్మూరి బాలాజీ, పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా, ఎంపీటీసీ సభ్యురాలు దూసరి నిర్మల చేతుల బుధవారం అందించారు.

సచివాలయ రికార్డుల తనిఖీ

గన్నవరం: స్థానిక బుద్ధవరం రోడ్డులోని గ్రామ సచివాలయం-2ను బుధవారం డీఎల్‌డీఓ కెఎస్ఎస్. సుబ్బారావు తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమం అమలు తీరుపై సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ నెల 24 నుంచి జూలై 1వ తేదీ వరకు సచివాలయ పరిధిలో సర్వే చేపట్టాలని సూచించారు. సర్వేలో స్వీకరించిన అర్జీలను పరిశీలించి ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎంపీడీవో సత్య కుమార్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీకి కృతజ్ఞతలు

రామవరప్పాడు: విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్ నుంచి నిడమానూరు మీదుగా పోరంకి వెళ్లే బస్సు నెంబర్ 79 సర్వీసును పునరుద్ధరించినందుకు బుధవారం గ్రామ సర్పంచ్ శీలం రంగారావు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ దానంను తన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శీలం రంగారావు మాట్లాడుతూ ఈ బస్సు రూట్ వల్ల గ్రామస్తులు, విద్యార్థులు, రైతులు, కూలీపనులను వెళ్లే వారికి బహుళ ప్రయోజనాలు పొందారన్నారు. ఇటీవల ఈ సర్వీసును నిలిపివేయడంతో గ్రామస్తులతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ సర్వీసును పునరుద్ధరించాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌ను కోరిన వెంటనే మరలా బస్సు వేసేందుకు కృషి చేశారన్నారు. పాఠశాలల తెరవడంతో విద్యార్థులకు, వేర్వేరు పనుల నిమిత్తం కాళేశ్వరరావు మార్కెట్‌కు వెళ్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌ను కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ పరిమి వంశీ, గ్రామ రైతులు వేములపల్లి బుజ్జి, అరవపల్లి బద్రయ్య, జయకృష్ణ తదితరులు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక వికాసం

కంకిపాడు: యోగాతో ఆరోగ్యం, మానసిక వికాసం కలుగుతాయని వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం మండల వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. కంకిపాడు సెయింట్‌మేరీస్ హైస్కూల్ ప్రాంగణంలో విద్యార్థులు వివిధ యోగాసనాలను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ లిషా యోగా వేడుకలను పర్యవేక్షించారు. కోలవెన్ను ఎంపీపీ పాఠశాల విద్యార్థులు యోగాసనాలను నేర్చుకుని విజయవాడలో జరిగిన వేడుకల్లో బుధవారం ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు. కార్యక్రమాలను ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ పి.నీలిమ పర్యవేక్షించారు. ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్‌లో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీహార్ యూనివర్సిటీలో యోగాలో గోల్డ్ మెడల్ పొందిన ధారణ యోగా ప్రాధాన్యతను వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జె.పద్మావతి పర్యవేక్షించారు.

యోగాతో ఆరోగ్యకర జీవితం

పెనమలూరు: యోగాతో ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చని సిద్ధార్థ ఆదర్శ పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో జరిగిన యోగా కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. యోగా చేయటం వలన మానసిక ప్రశాంతత, ఒత్తిడి నివారణ, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు యోగా చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్ కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ వి.సాయికృష్ణ, ఉపాధ్యాయులు హరిబాబు, శౌరిరెడ్డి, రాఘవేంద్రరావు, కనకరత్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో...

కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా చేశారు. యోగా ట్రైనర్ డాక్టర్ శ్రీనివాసరావు విద్యార్థులతో యోగా చేయించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు.

గంగూరులో...

గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో అంతర్జాతీయ యోగా దినోత్సవం చేశారు. ఈషా ఫౌండేషన్ సహకారంతో జరిగిన కార్యక్రమంలో యోగా గురువు ఎల్.లలితా ప్రియాంక, ఆషా ఫౌండేషన్ నిర్వాహకుడు వంశీమోహన్ విద్యార్థు

యోగా సాధనతో ఆరోగ్యం

నున్న(విజయవాడరూరల్): యోగా సాధనతో ఆరోగ్యవంతంగా జీవించవచ్చునని యోగా టీచర్ రజని కుమారి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం నున్న జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసానాలు వేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

యోగా సాధనతో ఒత్తిడి జయించవచ్చు

హనుమాన్‌జంక్షన్ రూరల్:యోగా అభ్యాసనం ద్వారా ఒత్తిడిని జయించవచ్చని, ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చని రేమల్లే జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.లూథర్ పాల్ అన్నారు. బాపులపాడు మండలంలోని వీరవల్లి, రేమల్లే జెడ్పీ హైస్కూళ్లు, ఆదిత్య బధిరుల విద్యాలయాల్లో బుధవారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు దారపురెడ్డి భాస్కరరావు యోగా ప్రాముఖ్యతను వివరించారు.



విజయవాడలో జరిగిన యోగా దినోత్సవంలో ప్రదర్శన ఇస్తున్న కోలవెన్ను విద్యార్థులు

వీరవల్లి జెడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయురాలు పి.నిర్మల, స్టాఫ్ కార్యదర్శి మానికొండ రమణగోపాల్ విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చారు. ఆదిత్య బధిరుల విద్యాలయంలో చెవిటి, మూగ విద్యార్థులతో యోగా ఆసనాలను కరస్పాండెంట్ ఆకుల వెంకట రమణ చేయించారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ఉయ్యూరు: యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కె.శ్రీహరి అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తితో పాటుగా న్యాయవాదులు, సిబ్బంది యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపీచంద్, ప్రతినిధులు పల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో యోగా డే ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ జీవీ రమణ, యోగా గురువు కోటేశ్వరరావు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. హెచ్‌ఎం శారద యోగా ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

గన్నవరం: మండలంలోని పలు విద్యా సంస్థల్లో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దావాజిగూడెంలోని ఎస్‌టీటీఎఫ్ కళాశాలలో శివ సిద్ధి కుండలిని యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఆసనాలు చేయించారు. ఈ సందర్భంగా శివసిద్ధి ప్రతినిధులు మాట్లాడుతూ యోగా సాధన ద్వారా విద్యార్థులకు మంచి ఆరోగ్యం, మనోనిబ్బరం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ముఖ్యంగా మానసిక ఒత్తిడి తగ్గడంతో పాటు విలువలతో కూడిన వ్యక్తిత్వం అలవాడుతుందన్నారు. ప్రిన్సిపాల్ మహీధర్, మేనేజర్లు పద్మజ, శ్రీనివాస్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రాణాయామం, ధ్యాన విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ ఎ. పద్మావతి, పలువురు అధ్యాపకులు, స్ఫూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. అసోసియేషన్ అధ్యక్షులు చిప్పాడ చంద్రశేఖర్‌రావు, పీఈటీ డి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగా జీవన విధానం కావాలి

గన్నవరం రూరల్: యోగా జీవన విధానం కావాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ కమాండెంట్ జాహిద్‌ఖాన్ చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కొండపావులూరు ఎన్‌డీఆర్‌ఎఫ్ ప్రాంగణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, జవాన్‌లు ఆసనాలు వేశారు. గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం కెఎస్ జగదీశ్వరరావు విద్యార్థులకు యోగాభ్యాసం నిర్వహించారు. ఆసనాలు, ప్రాణాయామం చేయించారు.

యోగాతో బహుళ ప్రయోజనాలు

రామవరప్పాడు: క్రమం తప్పకుండా యోగాసనాల సాధనతో బహుళ ప్రయోజనాలు చేకూరతాయని ఈషా ఫౌండేషన్ ప్రతినిధి శ్రీరామ్ చరణ్ అన్నారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని విజయ ఫార్మసీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగ ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ చరణ్ మాట్లాడుతూ నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం మన సొంతమవుతుందని తెలిపారు. నిత్య జీవితంలో యోగా ఒక భాగంగా మలుచుకోవాలని సూచించారు. మానసిక రుగ్మతలు, ఒత్తిడి జయించవచ్చని పేర్కొన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. పద్మలత, అధ్యాపకుల బృందం, జాతీయ సేవా పథకం అధికారి పాల్గొన్నారు.



విజయ ఫార్మసీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

గూడవల్లిలో..

గూడవల్లిలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులతో యోగ ఆసనాలు వేయించారు. వైద్యాధికారి కె. సునీత నిత్యం యోగ ఆసనాలు వేయడం ద్వారా కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుముద్ర వేణి, యోగ టీచర్లు స్వాతి, జగదీష్, హెచ్‌ఎం రవికుమార్, హాస్పిటల్ సిబ్బంది కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు కోర్టు ప్రాంగణంలో యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తి శ్రీహరి



యోగ సాధనలో కంకిపాడు సెయింట్‌మేరీస్ హైస్కూల్ విద్యార్థులు



కానూరు సిద్ధార్థ ఆదర్శ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు



రేమల్లే జెడ్పీ హైస్కూల్లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



యోగాసనాలు చేస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండెంట్ జాహిద్‌ఖాన్, సిబ్బంది

శాకంబరీదేవి ఉత్సవాలలో రైతులూ భాగస్వాములే



రైతులకు ఉత్సవాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఆలయ సిబ్బంది

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ప్రతి ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే శాకంబరీదేవి ఉత్సవాలలో రైతులు, కూరగాయల వ్యాపారులు భాగస్వాములేనని, ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలయ అధికారులు పిలుపునిచ్చారు. జూలై 1వ తేదీ నుంచి మూడో తేదీ వరకు ఇంద్రకీలాద్రిపై నిర్వహించే శాకంబరీదేవి ఉత్సవాలలో ఆలయ అలంకరణ నిమిత్తం కూరగాయలు, ఆకుకూరల సేకరణ నిమిత్తం ఆలయ అధికారులు ఎన్టీఆర్, కృష్ణాజిల్లా రైతులను సంప్రదించారు. నూజివీడు, పెద్ద ఓగిరాల, చిన్న ఓగిరాల, ఉయ్యూరు, విజయవాడ హోల్‌సేల్ కూరగాయల వ్యాపారులు దుర్గగుడి సూపరింటెండెంట్ హేమదుర్గాంబ, ఆలయ సిబ్బంది బుధవారం కలిసి ఉత్సవాల వివరాలను తెలియజేశారు. ఉత్సవాలలో అమ్మవారి ఆలయ అలంకరణ నిమిత్తం ప్రతి ఏటా ఇచ్చిన విధంగానే కూరగాయలు అందించేందుకు రైతులు, వ్యాపారులు సుముఖత వ్యక్తం చేయడమే కాకుండా మిగిలిన ప్రాంతాలకు చెందిన రైతులు, వ్యాపారులను భాగస్వాములను చేసి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరిస్తామని అన్నారు. అనంతరం ఆయా ప్రాంతాలకు చెందిన రైతులకు శాకంబరీదేవి ఉత్సవాల కరపత్రాలను దుర్గగుడి అధికారులు పంపిణీ చేశారు.

ఆర్థిక అక్షరాస్యత సాధించాలి



కంకిపాడు: ఆర్థిక అక్షరాస్యత సాధించాలని వణుకూరు ఇండియన్ బ్యాంక్ మేనేజరు షేక్ నాగూర్ బేగం అన్నారు. ఆర్థిక అక్షరాస్యతా కేంద్రం ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో గొడవర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇండియన్ బ్యాంక్ వణుకూరు బ్రాంచ్ సహకారంతో నిర్వహించిన క్విజ్ పోటీల్లో కోలవెన్ను, గొడవర్రు, తెన్నేరు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. వణుకూరు బ్రాంచ్ మేనేజర్ షేక్ నాగూర్ బేగం, ఆర్థిక అక్షరాస్యతా కేంద్రం కౌన్సిలర్లు కై లే సునీల్‌కుమార్, నాని, గొడవర్రు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డులపై రైతులకు అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్:కౌలు రైతులు పంట సాగుదారు హక్కు పత్రం (సీసీఆర్‌సీ) తీసుకోవటం ద్వారా పలు ప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి జొన్నలగడ్డ భవాని తెలిపారు. బాపులపాడు మండలంలోని కానుమోలు, కాకులపాడు, పెరికీడు, ఆరుగొలను గ్రామాల్లో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల జారీపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పంట సాగుదారు హక్కు పత్రం తీసుకోవటం వల్ల కౌలుదారులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, స్ప్రేయర్లు తీసుకునే అవకాశం ఉంటుందని ఏవో భవాని తెలిపారు. సీసీఆర్‌సీ కార్డు తీసుకున్న కౌలురైతు పేరిట ఈ-క్రాప్‌లో పంట నమోదు చేయటం ద్వారా ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టం వాటిల్లితే పంటల బీమా, ప్రభుత్వ నష్ట పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి కౌలురైతుకు అందుతాయని చెప్పారు. సీసీఆర్‌సీ కార్డు, ఈ-క్రాప్ నమోదు ద్వారా మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రంలో పంట విక్రయించేందుకు అస్కారం ఉంటుందని చెప్పారు. కాకులపాడు ఎంపీటీసీ సభ్యుడు పడకల కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



కౌలురైతులకు సీసీఆర్‌సీ కార్డుల గూర్చి వివరిస్తున్న వ్యవసాయాధికారి భవాని

జగనన్న గృహాల నిర్మాణానికి రుణాలు

పెనమలూరు: జగనన్న గృహాలు నిర్మాణం చేసుకునే పొదుపు సంఘాల సభ్యులకు ఆయా సంఘాల నుంచి రుణాలు ఇస్తామని డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. ఆయన బుధవారం పెనమలూరు మండలంలోని స్త్రీశక్తి భవనంలో డ్వాక్రా గ్రూపు సభ్యులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలలో భాగంగా పేదలందరికీ గృహాలు పథకం అమలు చేస్తోందన్నారు. గృహాలు నిర్మాణం చేసుకునే వారికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తుందన్నారు. దీనికి తోడు పొదుపు సంఘాల్లో ఉన్న సభ్యులకు రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు రుణాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. పొదుపు సంఘాల్లో ఉన్న సభ్యులు అలస్యం చేయకుండా వెంటనే జగనన్న గృహాలు నిర్మాణం చేసుకోవాలని సూచించారు. గృహాల నిర్మాణానికి అన్ని శాఖల అధికారుల సహకారం ఉంటుందని తెలిపారు. పొదుపు సంఘాల లీడర్లు కూడా సభ్యులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతాశర్మ, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఏపీఎం రాజ్‌గౌడ్, వివిధ శాఖల అధికారులు, సీసీలు, వీఏవోలు పాల్గొన్నారు.



డ్వాక్రా సభ్యులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న డీఆర్‌డీఏ పీడీ ప్రసాద్

చదువుతోనే పేదరికం నిర్మూలన

గన్నవరం రూరల్: చదువుతోనే పేదరికం నిర్మూలన సాధ్యమని నమ్మి, ఆ చదువులను పేదలకు వరంగా మార్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనీయులని ఎంపీపీ అనగాని రవి అన్నారు. వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఈ సంవత్సరం 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన జగనన్న ఆణిముత్యాలను బుధవారం ఆయన జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు ఎండీ గౌసానితో కలసి సత్కరించారు. ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 556 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన ప్రసంగి రోహితకు రూ.3 వేలు, 541 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన తిరుమలశెట్టి లక్ష్మీ మానసకు రూ.2 వేలు, 540 మార్కులతో తృతీయ స్థానం సాధించిన నీరుడు నవ్యశ్రీకి రూ.వెయ్యి రూపాయలు నగదు, సర్టిఫికెట్లను అందించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను శాలువాలతో సత్కరించారు.



సత్కారం పొందిన విద్యార్థులతో ఎంపీపీ అనగాని రవి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు గౌసాని తదితరులు

అక్షరాస్యత క్విజ్ పోటీల్లో ఆకునూరుకు ప్రథమస్థానం

ఉయ్యూరు: ఆర్‌బీఐ ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఆకునూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఆర్‌బీఐ మండల స్థాయిలో పాఠశాల విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత అంశంపై బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించింది. పోటీల్లో ఆకునూరు పదో తరగతి విద్యార్థులు మట్టా సుజ్ఞాన జ్యోతిక, కోడూరు నందిని ప్రథమ స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల హెచ్‌ఎం నక్కా సలోమి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ అభినందించి ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహాలను అందించారు. ఈనెల 28న విజయవాడలో నిర్వహించే జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు వీరు ఎంపికయ్యారు.



విజేతలతో ఆకునూరు ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ సలోమి

ఉద్యాన పంటలతో బహుళ ప్రయోజనాలు

కంకిపాడు: ఉద్యాన పంటలతో రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని జిల్లా ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి అన్నారు. మండలంలోని దావులూరు ఆర్‌బీకేలో బుధవారం ఉద్యానపంటల సాగుపై రైతులకు క్షేత్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద ఉద్యాన శాఖలో అనేక పథకాలు అమలులో ఉన్నాయన్నారు. రైతులు తాము ఎంచుకున్న పంటలకు రాయితీలను పొందాలంటే ఉద్యాన పంటలను సాగుకు ఎంపిక చేసుకోవాలన్నారు. కంద, పసుపు, అరటి, ఇతర పంటలను సాగు చేసే రైతులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంఐఏఓ సారిక మాట్లాడుతూ మైక్రో ఇరిగేషన్ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్ 90 శాతం రాయితీ వర్తిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి జోసఫ్ చందు, కె.సీ తారామయ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలు సాగు చేస్తే రాయితీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: కొత్తగా ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తుందని జిల్లా ఉద్యాన అధికారి జె.జ్యోతి తెలిపారు. బాపులపాడు మండలం మడిచర్ల, బిళ్లనపల్లి గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించారు. ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై ఆయా గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తీగ జాతి కూరగాయల మొక్కలు సాగు చేసే రైతులకు శాశ్వత పందిరి నిర్మాణం చేపట్టేందుకు రూ.లక్ష రాయితీలపై అందిస్తున్నామని తెలిపారు. కొత్తగా మామిడి, టిష్యూకల్చర్ అరటి, బొప్పాయి, జామ, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్ పామ్, పూల తోటలు సాగు చేపట్టే రైతులకు రాయితీ అందిస్తున్నట్లు చెప్పారు. ఉద్యాన తోటల్లో బిందుసేద్యం కోసం ఐదు ఎకరాల లోపు రైతులకు 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లుగా వివరించారు. అనంతరం మడిచర్లలోని పామాయిల్ నర్సరీని జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి పరిశీలించారు. మండల ఉద్యాన అధికారి హరిచంద్ పాల్గొన్నారు.

సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామ సచివాలయంలో భూముల రిజిస్ట్రేషన్ల సేవలు బుధవారం ప్రారంభమయ్యాయి. రిజిస్ట్రేషన్ శాఖ సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు ఇళ్లు, స్థలాలు, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను గ్రామ సచివాలయాల ద్వారా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా తొలిదశలో బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామ సచివాలయంలో భూముల రిజిస్ట్రేషన్లు ప్రక్రియ సేవలు అందుబాటులోకి రావటంతో మొట్టమొదటి రిజిస్ట్రేషన్‌ను బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన కొండపల్లి రామసీత కొనుగోలు చేసిన స్థలాన్ని గ్రామ సచివాలయం ద్వారా అధికారులు రిజిస్ట్రేషన్ చేసి దస్తావేజులు అందించారు. సొంతూరులోనే రిజిస్ట్రేషన్ పూర్తి కావటంతో రామసీత సంతోషం వ్యక్తం చేసింది. ప్రజలు గ్రామ సచివాలయం ద్వారా అందిస్తున్న రిజిస్ట్రేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సీవీఎల్ఎస్ఆర్‌వీ ప్రసాద్ కోరారు.